క్లుప్తంగా

షిప్‌యార్డ్ ఏజీఎంకు శుభాకాంక్షలు


ఏజీఎం సదశివంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

మల్కాపురం: షిప్‌యార్డ్ ఏజీఎం(ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్) సదశివంను కార్యాలయంలో గురువారం హిందుస్థాన్ షిప్‌యార్డ్ యాదవ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. సంఘ ప్రతినిధులు ఉరుకూటి మురళీధర్, జోగ రాజు, గొంప చిన్నాజీ, మొల్లి అప్పాలరాజు, ఉరుకూటి సింహాచలం, చొప్ప చిరంజీవి, ఎదుర శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలో కొలువైన షిర్డీసాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం బాబాకు నక్షత్ర హారతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి కీర్తనలు ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విశ్వ సత్యనారాయణ రావు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో నాగుల చవితి పార్కును అభివృద్ధి చేస్తున్నందున, భక్తులు, దాతలు భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు.

భారీ అన్నసమారాధన

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా గురువారం కలశ పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ పి.వి.సురేష్ సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశ ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. సాయంత్రం బాబాను పురవీధుల్లో పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో బాబా భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

మల్కాపురం: శ్రీహరిపురం లక్కీ అమర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వివిధ తరగతుల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనల స్టాళ్లను స్కూల్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచుతుందన్నారు. సోలార్ ప్లాంట్, వ్యర్థ నీటిని పరిశుద్ధ జలంగా మార్చే ప్రాజెక్ట్, ఆటోమేటిక్ సెన్సార్ లైట్లు మొదలగు ప్రదర్శనలను విద్యార్థులు ఏర్పాటు చేశారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం

సీతంపేట: బహుళ అష్టమి సందర్భంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో వేద పండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమం ఆచరించారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం కాళీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన
- 497 మందికి ఉచిత వైద్య సేవలు
- స్పెషలిస్ట్ వైద్యుల సేవలపై లబ్ధిదారుల హర్షం


వైద్యులు, సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో పూర్ణేందర్


వైద్య శిబిరంలో మందుల కిట్ అందజేస్తున్న నమ్మి శ్రీను, డాక్టర్ మానస


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు

విశాఖ విద్య: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రెండో రోజు గురువారం వైద్య శిబిరం కొనసాగింది. బుచ్చిరాజుపాలెం సచివాలయం-1 పరిధిలోని లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్, శ్రీనివాసనగర్‌లోని ప్రజలకు వైద్య సేవలు అందించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, వార్డు వలంటీర్లు కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 497 మంది వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరానికి తరలివచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా యూపీహెచ్‌సీ డాక్టర్ నమ్మి మానస తగిన ఏర్పాట్లు చేశారు. స్పెషలిస్టులకు సంబంధించిన కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఓపీ నమోదు వద్ద ఎలాంటి సేవలు కావాలనేది తెలుసుకొని, నేరుగా ఆయా కౌంటర్లలో ఉన్న స్పెషలిస్టు వైద్యుల వద్దకు ఆశ కార్యకర్తలు తీసుకెళ్లి, దగ్గరుండి వైద్యం చేయించేలా డాక్టర్ మానస ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించిన వైద్య నిపుణులు, సాధారణ వైద్యం, కంటి వైద్యులు, మహిళా సంబంధిత వ్యాధులకు ఆయా స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు చేశారు.

వైద్య శిబిరం సందర్శన

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జీవీఎంసీ జోన్-8 కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేందర్ సందర్శించి, వైద్య పరీక్షలను పరిశీలించారు. వైద్య సేవల కోసం వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా తగిన శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందికి వారు సూచించారు. ఆరోగ్యశ్రీ సేవలపై విస్తృత ప్రచారం కల్పించేలా కరపత్రాలను అందరికీ ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు వార్డు నాయకుడు నమ్మి శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షించారు. శిబిరానికి వచ్చిన వారికి సకాలంలో వైద్య సేవలు అందించేలా వలంటీర్లను అప్రమత్తం చేశారు. వైద్య సేవలు పొందిన వారికి మందుల కిట్లు అందజేశారు. జీవీఎంసీ మలేరియా విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అవగాహన స్టాళ్లు ఏర్పాటు చేశారు.


బుచ్చిరాజుపాలెంలో రోగులకు సేవలందిస్తున్న ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు

బీపీ పరీక్షలు చేయించుకున్నా..



ఒంట్లో నలతగా ఉంటుంది. తరచూ బీపీ పెరుగుతోంది. ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకుంటే ఎంతలేదన్నా వెయ్యి రూపాయిలు ఖర్చవుతుంది. ఇక్కడ బీపీ పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్టు వైద్యులు బాగా చూశారు.

– చింతాడ పుణ్యవతి, గౌరీనగర్

ఒళ్లు నొప్పులకు మందులిచ్చారు



ఒళ్లు నొప్పులుతో ఇబ్బంది పడుతున్నాను. స్పెషలిస్టు వైద్యులు వచ్చారని తెలిసి, ఇక్కడికి వచ్చాను. అన్ని రకాల పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. కళ్లలో డ్రాప్స్ అడిగితే ,అది కూడా ఇచ్చారు. మా దగ్గరకే వైద్యులు వచ్చి సేవలు చేయడం సంతోషంగా ఉంది.

– కర్రి కుమారి, లక్ష్మీనగర్

వైద్య సేవలు బాగున్నాయి



దద్దర్లు తరచూ వస్తున్నాయి. దీన్ని తగ్గించుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఎక్కువ డబ్బులు ఖర్చవుతాయి. మా దగ్గరకే స్పెషలిస్టు వైద్యులు వచ్చారని చెబితే, ఇక్కడికి వచ్చి పరీక్షలు చేయించుకున్నాను. డాక్టర్లు బాగా చూసి మందులిచ్చారు. ఏర్పాట్లు బాగున్నాయి.

– సందపు తాతారావు, బుచ్చిరాజుపాలెం

'మెయింటెనెన్స్ సెంటర్'కు శంకుస్థాపన


ఐఎన్ఎస్ ఏకశిలాలో శంకుస్థాపన చేస్తున్న వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్

సింధియా: ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏవీఎస్ఎం, వీఎస్ఎం ఐఎన్ఎస్ ఏకశిలాలో గ్యాస్ టర్బైన్‌ల ఇంటర్మీడియట్ లెవల్ మెయింటెనెన్స్ సెంటర్‌కు విశాఖపట్నం నేవల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జనరల్, వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్ శంకుస్థాపన చేశారు. భారతీయతను ప్రపంచ దేశాలకు చాటిచెప్పే ఈ కీలక ప్రాజెక్టులు గ్యాస్ టర్బైన్ టెక్నాలజీలో నేవీ నిబద్ధతకు అద్దం పడతాయని అధికారులు తెలిపారు.

నూరు శాతం ఓటర్ల నమోదే లక్ష్యం

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మల్కాపురం: నూటికి నూరు శాతం అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా అంతా శ్రమించాలని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో) హుస్సేన్ సాహెబ్ పిలుపునిచ్చారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం ఓటు కార్డు పొందడం, ఓటు హక్కును సద్వినియోగ పరచడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఓటు హక్కు విలువ తెలుసుకుని, దానిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. మన ఓటే దేశ భవిష్యత్తును మార్చుతుందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు

- ప్రధాన జంక్షన్లలో పబ్లిక్ మైక్ సిస్టం ఏర్పాటు
- ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్


ఎన్ఏడీ సెంటర్‌లో మైక్ సిస్టం ద్వారా మాట్లాడుతున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

విశాఖ విద్య: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎన్ఏడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టం మైక్ సెట్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ రహదారిపై ఎన్ఏడీ, బిర్లా, తాటిచెట్లపాలెం ముఖ్య జంక్షన్లలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్(మైక్ సెట్) ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా ప్రజలకు, ప్రయాణికులకు, వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించేలా చర్యలు చేపట్టామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మైక్ సెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. హర్ష హీరో సంస్థ, పాత్ర ఇండియా కంపెనీ, హుండాయి కార్ల కంపెనీ వారి సౌజన్యంతో ఈ మైక్ సెట్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కట్టడి, వాహనదారుల్లో చైతన్యం కలిగించేలా వీటి ఏర్పాటుకు సహకరించిన సంస్థల ప్రతినిధులను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఆయా సంస్థల ప్రతినిధులు సురేష్, భార్గవ్ చరణ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి(టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. వేదాంత గ్లోబల్ కార్పొరేషన్, స్లైడ్‌కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఆర్‌ఏఎస్ టెక్నాలజీస్, వీల్స్ మార్ట్, ఈ జోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్, యాష్ స్టోర్స్, హెటిరో డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 415 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, కౌంటర్ క్యాషియర్, బ్రాంచ్ ఇన్‌చార్జ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ అండ్ జూనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ కెమిస్ట్, పోర్ట్ సర్వేయర్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిటైల్ ట్రెయినింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీల్లో ఉత్తీర్ణత సాధించిన 18–32 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.16,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

కథా నాటిక పోటీలు ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రవికృష్ణ


శిథిల జీవి నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : అజో-విభో-కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా మద్దిలపాలెం కళాభారతి వేదికగా నిర్వహిస్తున్న కథా నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమానికి ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి స్వాగత ఉపన్యాసంతో శ్రీకారం చుట్టారు. అనంతరం ఆత్మీయ అతిథి నంద్యాలకు చెందిన కళారాధన సంస్కృతిక సంస్థ, ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ జి.వి.రవికృష్ణ మాట్లాడుతూ కథలను నాటకాలుగా మార్చడంలో కంధాల ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కథలు, నాటకాలు పుస్తకాల రూపంలో తీసుకువచ్చిన సంస్థలను ఆయన అభినందించారు. చాలా ఏళ్ల క్రితం తాను రాసిన మాధవ సేవ కథను నాటిక పోటీలలో ప్రదర్శించడానికి అవకాశం కల్పించిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు. సినీనటుడు మిశ్రో మాట్లాడుతూ అహో ఆంధ్ర బోజా అన్నట్టుగా అజో- విభో-కందాళం పేరు ఉందన్నారు. రంగస్థల నటి అలపాటి లక్ష్మీ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా కళాకారులు ప్రదర్శిస్తున్నారన్నారు.

ఆకట్టుకున్న శిథిల జీవి నాటిక

పోటీల్లో తొలి ప్రదర్శనగా శిథిల జీవి నాటిక ప్రేక్షకులు హృదయాలను కదిలించింది. పల్లెలో ఓ పేద కుటుంబం జీవన తీరును కళాకారులు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి ప్రశంసలు పొందారు. ప్రముఖ రంగస్థల నటి ఆలపాటి లక్ష్మికి రంగస్థల సేవా మూర్తి జీవితకాల సాధన పురస్కారంతో పాటు రూ.10 వేల నగుదు అందించి సత్కరించారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

మర్రిపాలెం: ఇంటి దగ్గర పార్క్‌చేసిన తన పల్సర్ బైకు పోయిందని ఓ వ్యక్తి కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇందిరానగర్-3లో నివసిస్తున్న వి.చందు ఓ ప్రైవేట్ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. డిసెంబర్ 21న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎప్పటిలాగానే తన పల్సర్ బైకు(ఏపీ 39 ఎస్ఏ0840)ను కింద సర్వీస్ రోడ్డులో పార్క్‌చేసి పైన ఉన్న ఇంటికి వెళ్లారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఆఫీస్‌కు వెళ్లేందుకు కిందకి వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. దీంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో గురువారం ఫిర్యాదు చేయడంతో కంచరపాలెం క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికొచ్చిన పింఛన్

- పారిశ్రామిక ప్రాంతంలో చురుగ్గా పెన్షన్ల పంపిణీ
- రూ.3 వేలకు పెంపుపై లబ్ధిదారుల ఆనందం


58వ వార్డు పిలకవానిలెంలో మంచంపై ఉన్న రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్


61వ వార్డులో కార్పొరేటర్ సుధ చేతుల మీదుగా పింఛన్ అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న అవ్వ


62వ వార్డులో పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు


59వ వార్డులో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న నాయకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం, గొందేశివానిపాలెం తదితర ప్రాంతాల్లో పార్టీ వార్డు అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌రాజు, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్ ప్రసాద్, చుక్క వరలక్ష్మి తదితరులు వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి పెరిగిన రూ.3 వేల పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

- 59వ వార్డు నెహ్రూ నగర్, గణపతి నగర్, హిమాచల్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, సంపత్, రేవళ్ల సత్యనారాయణ తదితరులు వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.
- 61వ వార్డు జనతా కాలనీ సచివాలయం, మల్కాపురం సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొణతాల సుధ, పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు(కేబుల్ వాసు), జేఎస్ఏ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, పిలక వరలక్ష్మి, బూస అప్పలరెడ్డి, బాలు తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచడంపై లబ్ధిదారుల ఆనందం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో సచివాలయ కన్వీనర్లతో కలిసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందన్నారు. మళ్లీ ఆయననే ప్రజలంతా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఎస్.సత్యానారాయణ, చంటి, స్థానిక నాయకులు కనకరావు, మధు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యాషన్ రంగంపై అపోహ వద్దు'


మిస్ క్వీన్ పావనికి జ్ఞాపిక అందజేస్తున్న ఉషారాణి

సీతంపేట: కుటుంబ సభ్యుల సహకారంతో మిస్ అండ్ మిసెస్ క్వీన్ పోటీల్లో మిస్ విశాఖ క్వీన్ 2023గా నిలిచానని పావని అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు ఫ్యాషన్ రంగంలో రాణించడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. అపోహలు విడనాడి ఆకాంక్ష ఉన్న ప్రతి ఒక్కరూ ఫ్యాషన్ రంగంలో రావాలన్నారు. ఎంతో మంది పోటీ పడిన ఈ పోటీలో ప్రతిభ చూపి విజేతగా నిలిచానన్నారు. అనంతరం క్వీన్స్ ఈవెంట్ నిర్వాహకురాలు ఉషారాణి ఆమెకు జ్ఞాపిక అందజేసి అభినందించారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

సింధియా: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి ప్రకాష్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గురువారం 63వ వార్డు క్రాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం కేంద్రం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలిపే వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీనివాసరావు, డాక్టర్ ఐశ్వర్య, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ దిలీప్, 63వ వార్డు అధ్యక్షుడు రాజారావు, సీఈవో భాను, ఏపీడీ చిరంజీవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కారుతో వ్యక్తి అదృశ్యం


పృథ్వీ రాజు

అక్కిరెడ్డిపాలెం: ఓ వ్యక్తి కారుతోపాటు అదృశ్యమైన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి సమతానగర్‌లో జరిగింది. హెచ్‌సీ నారాయణ తెలిపిన వివరాలిలా .. సమతానగర్ వుడా కాలనీలో కింతాడ పృథ్వీరాజు కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈయన డిసెంబర్ 27న ఏపీ 31 సీఈ 306 నంబరు గల కారుతో సహా వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదని అతని బావమరిది సూర్యనారాయణ ఆచారి గాజువాక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. రాజుకు కొద్దిగా అప్పులు ఉన్నాయని, ఆయన రెండు ఫోన్ నంబర్లు స్విచ్ ఆఫ్ అయి ఉన్నాయని తెలిపారు. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లయ్య కళాశాలలో సైన్స్ ఫెస్ట్


విద్యార్థుల సైన్స్ నమూనాను పరిశీలిస్తున్న సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులు గురువారం నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక ప్రదర్శనలు, నమూనాలు వారి ప్రతిభకు అద్దం పట్టాయి. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి వారు తయారు చేసిన నమూనాల్లో ఇమిడి ఉన్న సాంకేతికత, ప్రయోజనాలను, మానవ జీవితానికి ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, బి.మాధవి, బ్రహ్మానందరెడ్డి సైన్స్ నమూనాలకు తిలకించి విద్యార్థులను అభినందించారు.